# ఆకలి గురువులు

ఆయినకు రోంత కాలుకుంటుండెగానీ, మనిసి మల్లా .... ఎత్తూ లావూ బాగనే వుండె. కుడి కాలు మోకాలు కింది నుంచీ కింది దాంకా ఎందుకో నవిసి[1] పోయింది. అందుకని, నడ్సేతప్పుడు కట్టె ఊదపొడ్సుకుంటా నడ్సేవాడు. కట్టుకొనే వొల్లెకంటే నెత్తికి సుట్టుకునే రుమాలే[3] పెద్దది. మనిసి నల్లటోడు, ఎప్పుడూ రోంత పిల్లిగడ్డం వుండేది. ఊళ్ళో ఆయనంత తెల్లగుడ్డలేసుకునేవాళ్ళు అప్పటికెవుర్లేరు. ఆయిన ఏం సదివి, ఎట్టెట్ట సదువుజెప్పే అయ్యవారయినారో గానీ, మన బాసే సరిగా మాట్లాల్లేడే, సదువెట్టా జెప్తాడబ్బా ... అని శానామందే అనుకొన్ని.

ఒక్కాట్లు ఒకటీ, రొండు కాట్లు రొండూ అని ఎక్కాలు సెప్పడానికీ, ఎప్పుడూ ఎట్టుండేటియి అట్టుండే ఓనమాలు సెప్పడానికీ ఎంత బాస రావాల్లే అని అవతల తెల్చిపాయె. సదువు జెప్పడానికాయినేమి సావుజంపులు పన్నట్టు లేదుగానీ, మాట్లాడ్డంలోనే పాపం ... బాగా యాతనపడిపాయె. అందరూ ఆయన్ను 'తురకయ్యవారు' అనీ, 'కుంటెయ్యవారు' అనీ అనేవాళ్ళు. పిల్లాజెల్లా కల్చి అంతా ఎంతమంది వుండేవాళ్ళో యెవురికీ తెల్దు. అయ్యవార్నడిగినా .... రుమాల తీసి నెత్తి గోక్కుంటా, 'ఏక్ ... దో... తీన్' అని ఎంచుకోనిగానీ సెప్పల్యాక పోయేవాడు. పిల్లోళ్ళు గాక యింగా యెవురో ఆడోళ్ళుండేవాళ్ళు.

అప్పుడు ఊళ్ళల్లో ఇండ్లకు బాడిగుండేది కాదు. ఇంట్లో కసువూడ్చుకొంటా, దీపం పెట్టే సాలనుకొనేవాళ్ళు. అందువల్ల అయ్యవారు కాపరం వుండడానికి పెద్ద యిండ్లే దొరికింది. అప్పుడు ఆయినకు జీతం ఎంత వచ్చేదో తెల్దుగానీ, వాళ్ళ బువ్వకు సాలేది గాదని తెల్చిపోయేది. అయ్యవారు తెల్లగుడ్డలేసుకోని, తెల్లరుమాల పెట్టుకోని బడికి పోతా వస్తా వుండెగానీ, ఇంట్లో ఆడపిల్లలకూ, మొగపిల్లోళ్ళకూ కట్టుకోను గుడ్డలే వుండేయిగావు. ఎప్పుడూ బయటకి వచ్చేవాళ్ళు కాదు గాబట్టి అందరికీ తెల్చేదిగాదు. అదే యింగెవురన్నా అయితే ఊళ్ళో వున్నోళ్ళ కాడికిపోయి పాతగుడ్డలడుక్కోని తెచ్చుకొనేవాళ్ళు. అయ్యవారి పిల్లోళ్ళు అయినందువల్ల ఆ పని సేయల్యాకపోయిరి. సేలల్లోకో, ఇండ్ల కాడికో పనులకూ పోల్యాకపోయిరి.

ఊళ్ళో యింగా సాయిబూలుండారు గానీ, వాళ్ళ పిల్లోళ్ళు కలుపులు తీయనో, కాయలేరనో ఇట్టాంటి పనులకు పోతా వుంటారు. సాయిబూలూ, మిగిల్న కులాలోళ్ళూ వరసలు కలుపుకోని, అత్తా, అక్కా, మామా అంట ఒకర్నొకరు పిల్చుకొంటా వుంటారు. ఊళ్ళలో పనిపాటల్లో కల్చేవాళ్ళకు వుండే సమందాలు కల్చనోళ్ళకు వుండవు. అందువల్ల, అయ్యవారి సంసారాన్ని అందరూ రోంత దూరంగా వుండి సూసినట్టు సూసేవాళ్ళు. పనులకు పోవడం అట్టా వుండనిచ్చి.... బూబమ్మ ఏటికి బోయి మంచినీళ్ళు కూడా తెచ్చుకోల్యాకపాయె. పగలు పోడానికి గోసా అయిపాయె, రాత్రి పోడానికి సీకటైపాయె.

1) సన్నవడి 2) ఊతగా 3) తలపాగా

అయ్యావారే బడి నుంచి వచ్చినాక ఏటికిబోయి కడవతో నీళ్ళు తెచ్చుకోవాల్చి వచ్చేది. ఒక సేత కట్టెబట్టుకోని, బుజం మీద కడవ బెట్టుకొని, నీళ్ళు తెచ్చుకొనే అయ్యవార్ని సూసి ఊళ్ళో పెద్దోళ్ళు, 'ఒరెరే..!' అనుకోని, ఆ పనికి బడిపిల్లోళ్ళను పురమాయిచ్చినారు. పోసుకోడానికింగ తావులేదు మొర్రోమని బూబమ్మ మొత్తుకొనేదాంకా బడిపిల్లోళ్ళు పరుగెత్తి పరుగెత్తి నీళ్ళు మోయబట్టిరి. ఏట్లో నీళ్ళు తేవడానికి పిల్లోళ్ళు వుండేదాన, అయ్యవారి సంసారానికి నీళ్ళ కరువు తీరె గానీ కడుపు అట్టాటిది గాదే. ఎన్నిమాట్లు నీళ్ళు తాగినా రోజు కొకపారన్నా బువ్వ తినాలగదా.

రోజూ అయ్యవారింట్లో కొట్టుకోడాలు, తిట్టుకోడాలు, ఏడ్పులు అందరికీ యినపడ్తానే వుండె. ఒకసారైతే ... ఆయన బడికి పోడానికి తయారయినట్టుంది. అప్పుడు పదిందబ్బా కొట్లాట. ఆయన కట్టె తీసుకోని బూబమ్మను బాగ కొట్టినట్టుంది. ఆమె లోపలింట్లో పాపం ... ఓ ... అంటా శోకాలు తీస్తాంది. సూస్తావుండిన ఇరుగూ పొరుగూ, "ఎందుకు బూబమ్మను అట్ట కొడ్తావుండావ"ని అడగల్యాక పోయిరి. ఆయిన బడికి పోడానికి రెండడుగులేసి, ఏమనుకొన్నాడో ఆడోళ్ళ దిక్కు తిరిగి "అది లంజా అమ్మా!" అని యింట్లో వున్న పెండ్లాం దిక్కు కట్టె ఎత్తి సూపె ! తీరా మాట అన్నాక, పెండ్లాన్ని తప్పుమాట అన్నెట్టు ఆయినకు అర్థమయింది. "లంజా అంటే అట్టలంజా కాదు, అదేంది అమ్మా నోటికి రాదూ, ఆ .... నోటి లంజ" అని యివరిచ్చినాడు. 'గయ్యాలి' అని సెప్పడానికి ఆయిన ఆ పెద్దమాట అన్నట్టు తెల్సినాక ... కొందరు నగిరి, కొందరు నగల్యాకపోయిరి. పెండ్లాల్ను ఆ మాటతోనే తిట్టేవాళ్ళున్నెప్పుడు, ఆయిన తెలక నోరు జార్నాడులే ... అని అందరూ అనుకొన్రి.

ఇత్తనాలప్పుడు ఇండ్లల్లో కూకునే సెనిక్కాయలు వొల్చి సంగటి గింజలు సంపాయించుకోవచ్చు. కడింటి ఎంగటపతి వొల్చండని అయ్యవారింట్లో కాయల మూటేసి, పడికి సెటాకు లెక్కన యిత్తనాలు తగ్గినాయని లబోదిబోమనె. ఆయప్ప అసలే బంకోడు[4]. ఇత్తనాలు ఇంట్లో అందరూ బొక్కులాడి[5]నారనీ, కారెం గూడా సేసుకొన్నారనీ .... యిట్ట రచ్చజేసె. అయ్యవారన్న గౌరువం సూడమని ఆయప్పను అంతా మందలిచ్చి నోరు మూయిచ్చిరి. అయితే, ఆ యప్పను మందలిచ్చిరే కానీ పిరెంకాయిలయినందున, మల్లెవురూ వొల్చమని అయ్యవారింట్లో కాయలు పోయల్యాకపోయిరి. ఇదెందుకు సెప్తినంటే ... ఆకలికి గౌరువం తెల్దనడానికి. 'పరుల సొమ్ము తాకరాదు' అని అయ్యవారు పిల్లోళ్ళకు నీతి సెప్తే మాత్రం అది కుదుర్తాదా ? అనడానికి.

ఇంగ అయ్యవారి సంగతి జెప్పాలంటే... కడుపులో ఎట్టనో వుంటాది. పిల్లోళ్ళకు సదువు జెప్పడం కంటే ఎక్కువగా ఎప్పుడూ యియ్యే అడుగుతా వుండేవాడు. ఒక్కొక్క పిల్లోన్నే లేపి ... 'ఏం తినొచ్చినావు?' అని అడిగేవాడు. "సద్దెన్నమా ? వరి బువ్వేనా ? గద్ద పెరుగేసుకోలేదూ ? కడుపు నిండా బాగా మెక్కి వచ్చినావన్న మాట ..." ఇట్టా. పండగలప్పుడైతే పతేకంగా పెశ్నలు. "ఉగాదికి మీ యింట్లో ఏమేం జేసుకున్నార్రా?'... "పాసెం, ఆబువ్వ[6], పప్పు" అని వాడు సెప్తావుంటే, "బచ్చాలు, ఓలిగలు సెయ్యలేదూ?" అని అడిగేవాడు. లేదని వాడు అడ్డంగా తలూపితే, వాడు నిజం సెప్పడం లేదన్నట్టు యింగొకర్ని అడిగేవాడు.

4) పిసినారి 5) తినేశారని 6) వరి అన్నం

వాడు వరసగా "ఓలిగలు, సిత్రాన్నం ..." అని సెప్పబడ్తే "పాసెం జేసుకోలేదూ?" అనడిగేవాడు. "ఓలిగలూ, పాసెం జేసుకున్నోళ్ళెవరో సేతులెత్తండ్రా!" అనేవాడు. "ఓలిగలూ, పాసెమూ ఎవురూ జేసుకోర్సార్" అని వాళ్ళు గట్టిగా అర్సి సెప్తే, "ఎందుకు జేసుకోరు? సేసుకొనేవాళ్ళను నేను సూసినా" అంటాడు. ఇంగ ఉగాది అయినాక పార్నపండగ. "ఈ మాంసం పండక్కు మీ యింట్లో కోడిమాంసమా, పొట్లి[7] మాంసమా?" వాడు కోడి అనో, పొట్లి అనో సెప్తే... "పలావ్ సేసుకొంటారా? ఊరికే పులుసు సేసుకొంటారా? పలావ్ అయితే బాగుంటాది" "అయితే, నువు కోడిమాంసం తినొచ్చినానంటావు, తినొచ్చినట్టు మాకేం నమ్మకం ? సెయి వాసన సూసి సెప్తారా". అప్పుడు కోడి సియ్యలూ, వరి బువ్వా 'కడుపునిండా' తినొచ్చినవాని సేయి వాసన సూస్తాడు. "నిజమేరోయ్, యీడు కోడిమాంసం, బువ్వా తినొచ్చినాడు, దొంగ భడవ ! సెయ్యి వాసనొస్తా వుండాది" అని వాని పొట్టలో పొడ్సేవాడు నగుతానే.

ఎప్పుడడిగినా "కారెం, సంగటి తినొచ్చినా" అనే వాళ్ళను అడిగేవాడు కాదు. అందరూ పొద్దున్నే లేస్తానే మొకాలు కడుక్కోని, సద్ది అన్నంలో గడ్డ పెరుగేసి కలుపుకోని, ఊరుమిండి నంజుకోని తిని బడికొస్తే, కడుపులో సల్లగా వుంటాదని సెప్తాడు. అట్టనే మద్యాన్నం, రాత్రికి మల్లా వరి బువ్వా, పప్పులో గమగమా వాసనొచ్చే నెయ్యేసుకోని తినాల ! ఇదీ కత. ఈ కత ముప్పయ్యేళ్ళకు ముందటిదే. ఇప్పటికీ ఆయనగ్గర సదువుకున్నోళ్ళు శానామందే వుండారు. వాళ్ళెవురికీ పుస్తకం పట్టుకుంటే ఆయన గ్యాపకం రాదుగానీ, బువ్వ తిని అట్ట కూకుంటే గ్యాపకం వస్తా వుంటాదు. "కడుపు నిండా బువ్వ తింటివా ? ఏమేం తింటివి?" అని అడుగుతాన్నెట్టే వుంటాది.

7) పొట్టేలు